ప్రజాశక్తి
శనివారం 7 అక్టోబర్ 2023 5 అనంతపురం





2కె రన్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ అన్బురాజన్

రోడ్డు భద్రతా నియమాలను పాటిద్దాం

ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్

ప్రజాశక్తి-అనంతపురం

రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించి ప్రమాదాలను నివారిద్దామని ఎస్పీ కెకెఎన్.అన్బురాజన్ తెలిపారు. పోలీసు, ఆర్టీఏ విభాగాలు సంయుక్తంగా రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తూ శుక్రవారం నాడు అనంతపురం నగరంలో 2కె రన్ నిర్వహించారు. నగరంలో తెలుగు తల్లి కూడళి వద్ద జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్, డిటిసి ఎం.వీరరాజులు పచ్చ జెండా ఊపి 2 కె రన్ ప్రారంభించారు. అంబేద్కర్ కూడళి, సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డుల మీదుగా క్లాక్ టవర్ వరకు 2కె రన్ కొనసాగింది. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పిలుపునిచ్చారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. కార్లు నడిపే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు. త్రిబుల్ రైడింగ్ చేయరాదన్నారు. మద్యం సేవించి వాహనాలు డ్రైవ్ చేయరాదన్నారు. అతి వేగంగా వాహనాలు నడపకూడదన్నారు. తప్పని సరిగా వాహనాలకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించి ఇళ్లకు భద్రంగా చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్ విజయభాస్కర్ రెడ్డి, ఎ.హనుమంతు (ఏఆర్), జెఎన్టీయు రిజిస్ట్రార్ శేషాద్రి, అనంతపురం డీఎస్పీ జి.ప్రసాదరెడ్డి, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, అనంతపురం ఆర్టీవో సురేష్ నాయుడు, పలువురు సిఐలు, ఆర్ఐలు, పోలీసు సిబ్బంది, జెఎన్టీయు విద్యార్థులు పాల్గొన్నారు.



సగానికి సగమే..!

◆ టిబి డ్యామ్‌లో గతేడాది ఫుల్...ఈ ఏడాది హాఫ్..

◆ హెచ్ఎల్ఎంసికి సగం కంటే తక్కువే

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

నిత్యం కరువు ప్రాంతమైన అనంతపురం జిల్లాకు ప్రధానమైన సాగునీటి వనరుగా తుంగభద్ర డ్యామ్ ఉంది. ఆ డ్యామ్ నుంచే తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు నీరొస్తుంది. అదే సాగు, తాగునీటి అవసరాలనే తీర్చే ఏకైక వనరుగానుంది. ఈ ఏడాది తుంగభద్ర డ్యామ్‌కు నీరు ఆశించినంత రాలేదు. సాధారణంగా ఆగస్టు, సెప్టంబర్ మాసాల్లోనే ఈ డ్యామ్‌కు నీరు పుష్కలంగా వచ్చేది. ఈసారి తుంగభద్ర ఎగువ భాగంలో వర్షాలు ఆశించినంత రాకపోవడంతో డ్యామ్ కూడా నీరు చాలా తక్కువగా వచ్చింది. దీంతో డ్యామ్ కిందనున్న కాలువలకు నీటి కేటాయింపులు తగ్గిపోయాయి.

సగానికి సగమే..

గతేడాది ఇదే సమయానికి తుంగభద్ర డ్యామ్‌కు 536.20 టిఎంసిల నీరు వచ్చింది. జూన్ నుంచి అక్టోబరు నాటికి వచ్చింది. దీంతో గేట్లు ఎత్తి పలుమార్లు నీటిని నదిలోకి వదిలారు. ఇంత పెద్దఎత్తున నీరు రావడంతో ఇదే సమయానికి డ్యామ్ కూడా నిండుకుండలాగా తొనకిసలాడుతూ ఉంది. పూర్తి సామర్థ్యంతో 105.79 టిఎంసిల నీరు ఉంది. ఇన్‌ఫ్లస్ కూడా ఈ సమయానికి 23,727 క్యూసెక్కులుండేవి. ఇప్పుడు చూస్తే అక్టోబర్ ఆరవ తేదీ నాటికి డ్యామ్‌లో నీటి మట్టం కేవలం 52.73 టిఎంసిలే ఉంది. 4437 క్యూసెక్కులు మాత్రమే ఇన్‌ఫ్లోస్ ఉన్నాయి. ఇక తుంగభద్ర ఎగువ భాగం పెద్దగా వర్షాలొచ్చే పరిస్థితి కనిపించడం లేదు. జూన్ నుంచి ఇప్పటి వరకు వచ్చిన నీరే 106 టిఎంసిలు ఉన్నాయి. ఈ నీటిని ఇప్పటికే వినియోగించుకుంటూ ఉండటంతో సగం తగ్గిపోయాయి. ఈ ప్రభావం దిగువనున్న తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, దిగువ ప్రధాన కాలువలకు నీటి కేటాయింపుల్లోనూ కోత పడింది.

తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు సగానికి కోతే...

తుంగభద్ర డ్యామ్‌లో నీటి లభ్యత తగ్గడంతో తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీటి కేటాయింపుల్లో కోతపడింది. జూన్‌లో వేసిన అంచనాల ప్రకారం 26.828 టిఎంసిల నీరు వస్తుందనుకున్నారు. తాజా అంచనాల ప్రకారం అది 16 టిఎంసిలకే పడిపోయింది. గతేడాదితో పోలిస్తే సగం కంటే తక్కువే కావడం గమనార్హం. గతేడాది తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ద్వారా జిల్లాకు వచ్చింది 36.50 టిఎంసిలు. ఈ ఏడాది 16 టిఎంసిలే కావడం గమనార్హం. అది కూడా గతేడాది కంటే తక్కువగా నీరు జిల్లాకు రానుంది. ఇది తాగునీటి అవసరాలకు సరిపోనుంది. ఈ నేపథ్యంలో నీరొస్తుందని ఆశించిన పంటలు సాగు చేసిన ఆయకట్టుకు రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఇదికూడా నవంబరు ఒకటికి నీటిని నిలిపివేసే సూచనలు కనిపిస్తుండటంతో ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ రైతులు తీవ్రంగా నష్టపోయే సూచనలు కనిపిస్తున్నాయి.

కారుణ్య నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి-అనంతపురం క్రైం



మోంగార్డు భార్యకు నియామక పత్రం అందజేస్తున్న ఎస్పీ అన్బురాజన్

జిల్లాలో ఇటీవల అనారోగ్య కారణాలతో మృతిచెందిన ఇద్దరు హోంగార్డు కుటుంబాలకు జిల్లా పోలీసు శాఖ అండగా నిలిచింది. మృతుల భార్యలకు కారుణ్య నియామకం కింద ఇద్దరికి హోంగార్డు ఉద్యోగాలు ఇస్తూ ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ శుక్రవారం నియామకపత్రాలు అందజేశారు. హోంగార్డులుగా విధులు నిర్వహిస్తూ ఆనారోగ్యం కారణంగా ఆగస్టు 9న మారెన్న, ఏప్రిల్ 14న ఖాజామొహిద్దీన్ మృతిచెందారు. దీంతో వారు భార్యలు నాగమణి, రహీమున్నీసా బేగంకి కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగాలు ఇస్తూ నియామక ఉత్తర్వులు అందజేశారు. అలాగే మారెన్న కుటుంబానికి రూ.4,29,600 చెక్కుతోపాటు జిల్లా హోంగార్డుల ఒకరోజు వేతనం నుంచి రూ.4,29,600 చెక్కును ఎస్పీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎ.హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజ్, ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రేమజంట ఆత్మహత్యాయత్నం

యువతి మృతి
చావుబతుకుల మధ్య ప్రియుడు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



మృతిచెందిన అలేఖ్య

తమ పెళ్లికి పెద్దలు ఒప్పుకోరన్న మనస్తాపంతో ప్రేమజంట ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలోని కిష్టపాడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కిష్టపాడు గ్రామానికి చెందిన అలేఖ్య(17), లోకేశ్వర్‌రెడ్డిలు ప్రేమించుకున్నారు. అలేఖ్య గుంటూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతోంది. ఇటీవల ప్రేమ విషయాన్ని ఇరు కుటుంబాల పెద్దలకు తెలిపారు. కులాలు వేరుకావడంతో వీరి పెళ్లికి రెండు కుటుంబాల వారు ఒప్పుకోలేదు. తమ ప్రేమను పెద్దలు ఒప్పుకోలేదన్న ఆందోళనతో ఈనెల ఒకటో తారీఖున ఇద్దరు గ్రామంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం వారిని అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అలేఖ్య శుక్రవారం సాయంత్రం మృతి చెందింది. లోకేశ్వర్ రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

'గురుకులం'.. సమస్యల వలయం..!

ఇబ్బందుల నడుమ విద్యార్థులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అనంతపురం జిల్లా కేంద్రానికి అత్యంత సమీపంలో మండల కేంద్రమైన బుక్కరాయసముద్రంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. పాఠశాలలో 186 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ పాటించడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. భోజనంలో ఏమాత్రం నాణ్యత ఉండడం లేదని, పురుగులు పట్టిన కూరగాయలతో తయారు చేసిన కూరలు, నీళ్ల మజ్జిగ అందిస్తున్నట్లు తెలుస్తోంది. శుద్ధి చేసిన తాగునీటి సౌకర్యం లేక బోరు నీటినే తాగుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో విష పురుగులు పాఠశాల ఆవరణలోకి చొరబడుతున్నాయని, విద్యార్థుల చేత తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం శుభ్రం చేయిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఉపాధ్యాయులు బోధన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని పిల్లలు పేర్కొంటున్నారు. గతంలో కూడా పదో తరగతి ఫలితాల్లో సున్నా ఫలితా లు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రహరీ నిర్మించాలని, శుద్ధి చేసిన నీరు, మెనూ ప్రకారం భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల డిమాండ్ చేస్తున్నారు.



గురుకుల పాఠశాల



కూలిపోయిన ప్రహరీ..

విద్యావ్యవస్థను నిర్వీర్యం చేసే కుట్ర : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-గార్లదిన్నె

రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను దిగజార్చి పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే కుట్రలు చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు తరిమెల గిరి, సిద్దు, శివ విమర్శించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాడుతోందన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానాన్ని మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో అమలు చేస్తూ పాఠశాలలను విలీనాన్ని చేసి ప్రాథమిక విద్యను చిన్నాభిన్నం చేసిందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు తెరిచి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోగా పుస్తకాలు ఇవ్వమని సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి ప్రకటన చేయడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు లేక చదువుకోలేక గత విద్యా సంవత్సరంలో ఎక్కువ శాతం మంది ఫెయిల్ అయ్యారన్నారు. మరోవైపు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లల్లో మౌలిక సదుపాయాలు లేక, శిథిలమైన భవనాలలో విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా అధ్యక్షునిగా సుమంత్, కార్యదర్శిగా శరత్‌కుమార్, కార్యనిర్వహణ కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి, గర్ల్స్ కన్వీనర్‌గా సరితా, కో కన్వీనర్‌గా జోష్ణతోపాటు 15 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు గోవింద, వివేకానంద, కిషోర్, పవన్, యశ్వంత్, కిషోర్, సుచరిత హర్షిత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఐఓసీ ఆయిల్ ట్యాంకర్ల కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-గుంతకల్లు రూరల్

మండల పరిధిలోని నక్కనదొడ్డి గ్రామం వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఐఓసీ డిపో వద్ద ఆయిల్ ట్యాంకర్ల కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయిల్ ట్యాంకర్ల డ్రైవర్ క్లీనర్ అసోసియేషన్ కార్యదర్శి హనుమేష్ మాట్లాడుతూ డిపోలో కాళీ ట్యాంకర్లను అనుమతించకపోవడంతో కాంపౌండ్ బయట రోడ్డు లోనే ట్యాంకర్లను పార్కింగ్ చేసుకుంటున్నామన్నారు. అయితే హోటల్ నిర్వాహకుడు ట్యాంకర్లను ఇక్కడ ఉంచకూడదంటూ ఓ ట్యాంకర్ డ్రైవర్, క్లీనర్‌పై దాడి చేశారన్నారు. ఐఓసీ యాజమాన్యం పార్కింగ్ స్థలం చూసి ఉంటే తమకు ఇలాంటి పరిస్థితి వచ్చేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై కొందరి అధికారులను వివరణ కోరగా ఐఓసీ యాజమాన్యానికి పార్కింగ్ స్థలం చూపించాల్సిన బాధ్యత ఏమాత్రం లేదన్నారు. కొందరు ఓనర్లు డ్రైవర్ క్లీనర్ లను రెచ్చగొట్టి ఈ తరహా చర్యలకు పాల్పడడం వల్ల సంస్థకు నష్టం వాటిల్లడంతో పాటు ఇంధనం సకాలంలో పంపిణీ చేయడానికి ముఖ్య అవరోధం కలుగుతోందన్నారు. ట్యాంకర్ ఎప్పుడు ఫిల్లింగ్ చేయాలి అన్నది గంట ముందుగా ఓనర్‌కు మెసేజ్ వస్తుందని, ఆ సమయానికి ఐఓసీలోకి అనుమతిస్తామే తప్ప ఖాళీ ట్యాంకర్లకు పార్కింగ్ చూపించే అధికారాలు ఏమీ లేవన్నారు. కొందరు ట్యాంకర్ల ఓనర్లు రాజకీయం చేయడం ద్వారా నాలుగు గంటల పాటు ఫిల్లింగ్ స్తంభించిపోయిందన్నారు. ఈ నష్టానికి బాధ్యులు ఎవరంటూ ప్రశ్నించారు. ఓనర్ల రాజకీయాలకు డ్రైవర్లు, క్లీనర్లు బలికాకుండా తమ జీవనోపాధిని కాపాడుకోవాలని కోరారు.



ధర్నా నిర్వహిస్తున్న ఐఓసీ ఆయిల్ ట్యాంకర్ల కార్మికులు

కృష్ణాజలాల పంపిణీపై 'అఖిలపక్షం'ఏర్పాటు చేయాలి

ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కృష్ణాజలాల పంపిణీపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా నదీజలాల పంపిణీకి విధివిధానాలు రూపొందించాలని ట్రిబ్యునల్ సూచించిందన్నారు. అంతేగాకుండా రైపేరియన్ రైట్స్‌కు భిన్నం రాకుండా నదీ పరీవాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు నీటి పంపిణీ చేసే బాధ్యత ట్రిబ్యునల్‌పై ఉందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తెలంగాణా రాష్ట్రంలో ఎన్నికలు సమీపిస్తుండగా రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీలపై ప్రకటనలు ఇవ్వడం స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసమే అన్నారు. కర్ణాటక ఎన్నికలు ముందు కూడా ఆఘమేఘాలపై ప్రతిపాదనలు లేని అప్పర్ భద్ర ప్రాజెక్టును కేంద్ర ప్రాజెక్టుగా ప్రకటించడంతోపాటు రూ.5200 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. ఫలితంగా రాయలసీమకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటకే నిఖరజలాలు 811 టీఎంసిలు కాగా 512 టిఎంసిలు ఆంధ్రప్రదేశ్, 299 టీఎంసీలు తెలంగాణ వినియోగించుకోవాలని అంగీకారం కుదుర్చుకున్నాయన్నారు. ఆ పైన అదనంగా వచ్చే జలాలలను పంపిణీ చేసుకోవాల్సి ఉందన్నారు. అయితే తెలంగాణ ముఖ్యమంత్రి పదేపదే కృష్ణాజలాలలను పున్ణపంపిణీ చేయాలని ఏకపక్షంగా ప్రకటిస్తుండగా మన రాష్ట్ర ప్రభుత్వం గాని, ముఖ్యమంత్రి గాని నోరు మెదపకపోవడం బాధాకరమన్నారు. ఈనేపథ్యంలో సాగునీటి హక్కుల కోసం సిఎం జగన్ గట్టిగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతేగాకుండా రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాష్ట్రంలోని అన్ని రైతుసంఘాలు, నీటి పారుదల రంగ నిపుణులు, రాజకీయ పార్టీలతో చర్చించి అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరారు.

పోలీసు వ్యవస్థ, నేరాలపై అవగాహన

ప్రజాశక్తి-తాడిపత్రి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ హమీద్ ఖాన్

మహిళలు అపాయంలో ఉన్నప్పుడు 100కు లేదా సిఐ నంబర్‌కు డయల్ చేయాలని పట్టణ సిఐ హమీద్‌ఖాన్ సూచించారు. పట్టణంలోని విజయనగర్ కాలనీలో ఉన్న పద్మవాణి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శుక్రవారం సిఐ విద్యార్థులకు పోలీసు వ్యవస్థ, సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. పోలీసు శాఖలో నియామకాలు, ఉద్యోగాలు కానిస్టేబుల్ మొదలుకొని డిజిపి స్థాయి అధికారి వరకూ హోదాల గురించి వివరించారు. సైబర్ నేరాలు ఎలా జరిగే విధానం, అపరిచిత వ్యక్తుల ద్వారా వచ్చేటటు వంటి ఎలాంటి కాల్స్‌ను స్వీకరించవద్దని, వ్యక్తిగత విషయాలు, బ్యాంక్ ఖాతా వివరాలు ఎవరికీ తెలుపవద్దన్నారు. మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని సూచించారు. అందరూ బాగా చదివి ఉన్నత స్థాకియి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ జి.నాగపీరయ్య, హెచ్ఎంలు కె.అలిమా, ఎ.మహబూబ్ బాషా, ఇన్‌ఛార్జి రాజు, ఉపాధ్యాయ బృందం, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు బీటెక్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలో ఆగష్టు నెలలో నిర్వహించిన బి.టెక్ తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ ఆర్-20 రెగ్యులర్, బి.టెక్ తృతీయ సంవత్సరం రెండవ సెమిస్టర్ ఆర్-19, ఆర్-15 సప్లిమెంటరీ ఫలితాలు, బి.టెక్ తృతీయ సంవత్సరం ఒకటవ సెమిస్టర్ (ఆర్-20), (ఆర్-19), (ఆర్-15) సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య ఇ.కేశవరెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎక్జామినేషన్ ఆచార్య బి.చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. పరీక్షా ఫలితాల కోసం JNTUA వెబ్‌సైట్ http://jntuaresults.ac.inను సంప్రదించాలని తెలిపారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

పుట్లూరు : పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని ఎంఆర్‌సి కార్యాలయ సిబ్బంది డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంఆర్‌సి కార్యాలయం ముందు సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల ఆర్తనాదాలు ప్రభుత్వానికి కనబడలేదా.. అని ప్రశ్నించారు. వెంటనే బడ్జెట్‌లో పెండింగ్ వేతనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. లేనిపక్షంలో పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిటిఇఒ అశ్వర్థ, ఎంఐసి లక్ష్మీదేవి, సిఆర్‌పిలు వీరయ్య, జయచంద్ర, లాజరయ్య, నారాయణస్వామి, మెస్సెంజర్ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

14, 15న సిఐటియు రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 14, 15వ తేదీల్లో అనంతపురంలో రాయలసీమ ప్రాంతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తెలిపారు. శుక్రవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్ర కుమార్ అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 70 లక్షల మంది ఉద్యోగ, కార్మికులకు ప్రాతినిథ్యం వహించే అతిపెద్ద కార్మిక సంస్థగా సిఐటియు నిలిచిందన్నారు. రాష్ట్రం, దేశంలో ఉద్యోగ, కార్మికుల పక్షాన రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ బలీయమైన కార్మిక సంస్థగా ఎదిగిందన్నారు. 1970లో ఏర్పడి ఇటీవలే గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలను నిర్వహించుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, పథకాల్లో పని చేస్తున్న కార్మిలను, అసంఘటిత కార్మికులను ఐక్యం చేసి పోరాడుతోందన్నారు. రాయలసీమ ప్రాంతంలో ఉన్న కార్మికుల సమస్యలపై చర్చించి, కార్యక్రమాలు చేపట్టడం కోసం ఈనెల14, 15వ తేదీల్లో అనంతపురంలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ముత్తుజా, నాగభూషణం, రాము, నాగరాజు, మున్నూరు స్వామి, ఎర్రిస్వామి పాల్గొన్నారు.



రాయలసీమ ప్రాంతీయ సమావేశాల కరపత్రాలను విడుదలచేస్తున్న సిఐటియు నాయకులు

కార్పొరేషన్‌లో ఇంజినీ'రింగ్' గోల..!

పనుల కేటాయింపులో లోపించిన సమతుల్యత
బట్టబయలు అవుతున్న ఉద్యోగుల మధ్య విభేదాలు



ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగంలో పనులు కేటాయింపుల అంశం ఉద్యోగుల మధ్య విభేదాలను బట్టబయలు చేస్తోంది. ఇటీవల మహిళా ఇంజినీరింగ్ ఉద్యోగుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తోంది. వారికి పనులు అప్పగించేందుకు కూడా ఉన్నతాధికారిని సాహసం చేసే ప్రయత్నం కూడా చేయనట్లుగా ఉద్యోగ వర్గాలు చర్చ జరుగుతోంది. డిఈఈ దాక్షాయిని, అసిస్టెంట్ ఇంజినీర్ ఉమామహేశ్వరి నడుమ విభేదాలు నడుస్తున్నట్లు కార్పొరేషన్‌లో వ్యక్తం అవుతోంది. కార్మికుల మస్టర్ సమయంలో డిఈఈ దాక్షాయిని, అసిస్టెంట్ ఇంజినీర్ ఉమామహేశ్వరికి గైర్హాజరు వేయడం, లేదా ఆలస్యం అంటూ హాజరు పుస్తకంలో నమోదు చేయడం లాంటి ఘటనతో వారి నడుమ విభేదాలు పతాక స్థాయికి చేరాయి. ఇంజినీరింగ్ అధికారుల గొడవ చూసి కార్మికులే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా విభాగాధికారి సూపరింటెండెంట్ ఇంజినీర్ నాగమోహన్, కమిషనర్ భాగ్యలక్ష్మి వారితో మాట్లాడే ప్రయత్నం చేసినట్లు కన్పించలేదు. వారి మధ్య సయోధ్య చేకూర్చి విధులను సక్రమంగా నిర్వహించుకునేలా బాధ్యతలను కూడా ఎవరూ తీసుకోవడం లేదు. తాజాగా పనుల కేటాయింపులో భాగంగా వీధిలైట్ల నిర్వహణను సుబ్బరామయ్యకు, ఆఫీసు నిర్వహణను అసిస్టెంట్ ఇంజినీర్ ఉమామహేశ్వరికి కేటాయించారు. వీరిపై పర్యవేక్షణ బాధ్యతను డిఈఈ దాక్షాయినికే అప్పగించారు. గతంలో వీధిలైట్ల నిర్వహణ బాధ్యత నిర్వహించే ఉమామహేశ్వరిని ఆ బాధ్యతల నుంచి తప్పించారు. ఆమె స్థానంలో సుబ్బరామయ్యకు ఆ పనులు అప్పగించారు. ఆఫీసు నిర్వహణ బాధ్యతలను నిర్వహించే డిఈఈ శేఖర్‌ను ఆ పనుల నుంచి మార్చారు. స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా పనుల నిర్వహణ బాధ్యతలను గాలికి వదిలేసి పది రోజుల సెలవుపై వెళ్లడం ద్వారా ఈయన కమిషనర్ ఆగ్రహానికి గురయ్యారు. మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టర్ కోటేశ్వరరావు పర్యటన సందర్భంగా భూరీసర్వేపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో వేదికపై సామగ్రిని ఇంటికి తరలించడం లాంటి అంశంపైనా ఆయన కమిషనర్ చేత ఆగ్రహానికి గురయ్యారు. ఆఫీసు నిర్వహణను అసిస్టెంట్ ఇంజినీర్ ఉమామహేశ్వరికి యథాతథంగా అప్పగించారు. వారిపై పర్యవేక్షణ బాధ్యతలను దాక్షాయినికి అప్పగించటం చూస్తే మహిళా ఇంజినీరింగ్ అధికారుల గొడవలను పెంచేందుకు అన్న భావన కార్పొరేషన్ వర్గాల్లో వ్యక్తం అవుతోంది. వాటర్ వర్క్స్ నిర్వహణ బాధ్యతలను అసిస్టెంట్ ఇంజినీర్ బాబావలీకి, డిఈఈ చంద్రశేఖర్‌కు ఇచ్చారు. వీరిపై పర్యవేక్షణ అధికారిగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యనారాయణకు అప్పగించారు. ఐదు మంది అసిస్టెంట్ ఇంజినీర్లు, ఏడుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు పనుల కేటాయింపులు జరిగాయి. 12 మంది అసిస్టెంట్ ఇంజినీర్లకుగాను ఐదుగురు మాత్రమే ఉండటంతో వారిపై అధిక పని భారం పడుతోంది. వీరిలో ఇద్దరు అసిస్టెంట్ ఇంజినీర్లకే కీలకమైన పనుల కేటాయింపు జరిగింది. ఇటీవల బదిలీపై వచ్చిన ముగ్గురు అసిస్టెంట్ ఇంజినీర్లలో ఒకరు పూర్తిగా ఉద్యోగోన్నతిపై వచ్చిన వారు కాగా, మరొకరు ఏడాదిలో ఉద్యోగ విరమణ చేయనున్నారు. మరొకరు డైరెక్ట్ రిక్రూట్మెంట్‌లో అసిస్టెంట్ ఇంజినీర్‌గా నియమితులయ్యారు. ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రాంప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ శంకర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇందులో చెత్త తరలింపు వాహనాలకు డీజిల్ సరఫరా వాహనాల మరమ్మతులు కొత్త ప్రాజెక్టుల డిపిఆర్ తయారు చేయటం, అమృత్ స్కీముల తదితర అంశాల పర్యవేక్షణను అసిస్టెంట్ ఇంజినీర్ శంకర్‌కు అప్పగించారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఇంజినీరింగ్ విభాగంలో పనుల కేటాయింపులో సమతుల్యత లోపిస్తోందనే భావన ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. ఒకరిద్దరికే అధిక ప్రాధాన్యతను కల్పించారన్న విమర్శలూ వ్యక్తం అవుతున్నాయి. విభేదాల నడుమ సాగుతున్న ఇంజినీరింగ్ విభాగాన్ని గాడిలో పెట్టేందుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వృద్ధులతో మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకూ'
ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం : ప్రజా సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు పరిష్కరించేందుకే గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి తెలిపారు. శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందించడంలో మనసున్న మారాజు సిఎం జగన్ అన్నారు. రాష్ట్రాన్ని సొంత కుటుంబంలా చూసుకుంటూ పరిపాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, బుక్కరాయసముద్రం సర్పంచి పార్వతి, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ పప్పుశనగకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం

అనంతపురం : రబీ సీజన్లో పప్పుశనగ సాగు చేసే రైతులకు అందించే రాయితీ విత్తనాల కోసం రిజిస్ట్రేషన్లను ప్రారంభించినట్లు జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 12,083 మంది రైతులు పప్పుశనగ కోసం రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్నారన్నారు. సుమారు 17,312 క్వింటాళ్ల విత్తనం కోసం రైతులు నమోదు చేసుకున్నారని చెప్పారు. ఆయా రైతు భరోసా కేంద్రాల వారీగా విత్తనాన్ని సిద్ధం చేయాలని ఏపీ సీడ్స్‌కు ఆదేశాలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. నల్లరేగడి భూముల్లో రబీ సీజన్ కింద పప్పుశనగ సాగు చేయాలనుకునే రైతులకు సబ్సిడీపై పప్పుశనగ పంపిణీ చేస్తామని చెప్పారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతిచెందిన నాగభూషణ

ఉరవకొండ : లగేజ్ బొలేరో వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో వ్యక్తి మృతిచెందాడు. మరో ముగ్గురికి స్వల్పగాలైన ఘటన విడపనకల్లు మండల పరిధిలోని కొట్టాలపల్లి బస్టాండ్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక ప్రాంతం నుంచి లగేజ్ బొలేరో వాహనంలో 50 గొర్రెలను తీసుకుని వస్తుండగా వాహనం టైర్ ఫంచర్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో రేకులకుంట గ్రామానికి చెందిన నాగభూషణ (55) అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనతోపాటు బొమ్మలాటపల్లి, బొందలవాడ, నార్పల గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా గొర్రెలు కూడా కొన్ని గాయాలపాయ్యాయి. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య



మృతిచెందిన కృష్ణవేణి

పుట్లూరు : మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని ఏ.కొండాపురం గ్రామంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ఏ.కొండాపురం గ్రామానికి చెందిన కృష్ణవేణి (49) కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. ఉన్న కూతురుకు కూడా పెళ్లి కావడంతో వెళ్లిపోంది. దీంతో కొండాపురంలో ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈనేపథ్యంలో కృష్ణవేణికి తరచూ కడుపునొప్పి వచ్చేంది. గురువారం రాత్రి కూడా కడుపునొప్పి విపరీతంగా రావడంతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కూతురి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

గుత్తి : పట్టణంలోని బెస్తవీధికి చెందిన ఓ వివాహిత శుక్రవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బెస్తవీధిలో నివాసం ఉండే కుటుంబ సమస్యలతో విషపు ద్రావకం తాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గుంతకల్లు మండలంలోని వైటి చెరువు గ్రామానికి చెందిన వెంకటేష్ ద్విచక్రవాహనంలో గుత్తికి వస్తుండగా రహదారిలో ఓ వ్యక్తి అడ్డు వచ్చాడు. దీంతో సడన్‌గా బ్రేక్ వేయడంతో బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రి తరలించారు.

నేడు 'డయల్ యువర్ డిఎం'

అనంతపురం : ఎపిఎస్ ఆర్టీసీ అనంతపురం డిపో రవాణా సమస్యలు, సలహాలు, సూచనలపై ఈ నెల 7వ తేదీ సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్యలో 08554-248553 నంబర్‌కు కాల్ చేసి మాట్లాడవచ్చునని డిపో మేనేజర్ నాగభూపాల్ తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి సమస్యలను నివృత్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు ర్యాగింగ్‌పై అవగాహన

అనంతపురం : నేషనల్ మెడికల్ కమిషన్, డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రభుత్వ వైద్య కళాశాల సెంట్రల్ హాల్లో శనివారం యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్, సీనియర్ సివిల్ జడ్జి దీన, లోక్ అదాలత్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు హాజరుకానున్నట్లు తెలిపారు.

దళితులపై దాడులను అరికట్టాలి

గార్లదిన్నె: దళితులపై అగ్రవర్ణాల దాడులను అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు బండారు కుళ్లాయప్ప, కదిరప్ప, డప్పు నాగరాజు డిమాండ్ చేశారు. గత గురువారం గార్లదిన్నె మండలంలోని ముకుందాపురం గ్రామంలో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎస్సీలపై వైసిపి కార్యకర్తలు, నాయకులు చేసిన దాడిని నిరసిస్తూ శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముకుందాపురంలోని దళిత నాయకులు స్థానిక సమస్యలపై ప్రశ్నించినందుకు వైసీపీకి చెందిన నాగుల్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, తదితరులు కులంపేరుతూ దూషించి పక్కకు నెట్టివేయడం బాధాకరమన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు తరిమెల రామాంజనేయులు, బుదేడు రామాంజనేయులు, మల్లికార్జున, కణంపల్లి రాజా, గోవిందు, కల్లూరు ఆనందు, హుస్సేన్, పుల్లన్న, శ్రీరాములు, సురేష్ బాబు, సాంబశివ, లాజరు, సల్మాన్‌రాజ్, ప్రభు, రాము, వంశీ, సురేష్, నల్లప్ప, ఆదినారాయణ, నాగేంద్ర, మల్లికార్జున, కె.రామాంజనేయులు, ఓబుళప్ప, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పిలోనే గురుకుల పాఠశాల భవనం నిర్మించాలి

కుందుర్పి : బిసి గురుకుల పాఠశాల భవనం కుందుర్పిలోనే నిర్మించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో నాయకులు డిమాం డ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు వారు నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ నియోజవర్గ ఎమ్మెల్యే, మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ అడిగిన వెంటనే సిఎం జగన్ గురుకుల పాఠశాల భవనం కోసం రూ. 25 కోట్లు విడుదల చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. అయితే కొందరు స్వార్థపరులు గ్రామంలో అఖిలపక్ష నాయకులతో చర్చించకుండా మండల పరిధిలోని ఎనుమలదొడ్డి గ్రామపంచాయతీలో భవన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. కావున మండల కేంద్రమైన కుందుర్పిలోనే బిసి గురుకుల పాఠశాల భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దార్ తిప్పేస్వామికి వినతిపత్రం అందజేశారు. ధర్నాలో అఖిలపక్ష నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు నరసింహులు, మల్లికార్జున, లక్ష్మీదేవి, రిటైర్డ్ విఆర్ఒ తిప్పేస్వామి, సిపిఐ సీనియర్ నాయకుడు హరిదాసులు, రాంబాబు, అనిల్, రామాంజనేయులు, నాగేంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలి



పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న జనసేన నాయకులు

బెలుగుప్ప : మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలోని ఎస్సీ కాలనీకి తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని జనసేన పార్టీ మండల అధ్యక్షులు కాశంశెట్టి సుధీర్ డిమాండ్ చేశారు. శుక్రవారం గుండ్లపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించి స్థానిక గ్రామ కార్యదర్శితో కలిసి పైప్‌లైన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి పైపులో లీకేజీ కావడంతో నీరు కలుషితం అవుతోందన్నారు. కలుషిత నీటిని తాగడం వల్ల రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయమై ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీలైనంత త్వరగా లీకేజీలను అరికట్టాలని కోరారు. ఇందుకు గ్రామ కార్యదర్శి శ్రీరాములు స్పందిస్తూ మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు చెన్నకేశవ, ప్రహ్లాద, తదితరులు పాల్గొన్నారు.

మూడేళ్ల బాబు కిడ్నీలో రాళ్లు

21 మి.మీ రాయిని తీసిన కిమ్స్ సవీరా వైద్యులు

ప్రజాశక్తి-అనంతపురం

మూడేళ్ల చిన్నారికి కిడ్నీలో రాళ్ల ఏర్పడటం, అది కూడా పెద్ద పరిమాణంలో ఉండటంతో అనంతపురం కిమ్స్ సవీరా వైద్యులు శస్త్రచికిత్స చేసి తొలగించారు. ఇంత చిన్న వయసులో ఉన్న పిల్లలకు రాయలసీమ ప్రాంతంలో ఇలా శస్త్రచికిత్స చేయడం ఇదే మొదటిసారి అనిఆసుపత్రికి చెందిన యూరాలజస్టులు నరేంద్రనాథ్ లోకారే, దుర్గాప్రసాద్ వివరించారు. ఇందుకు సంబంధించిన వివరాలను వైద్యులు వెల్లడించారు..అనంతపురానికి చెందిన మూడేళ్ల వయసున్న మునాఫ్ కుడివైపు తీవ్రమైన కడుపునొప్పి రావడంతో బయట వైద్యులకు చూపించారు. అక్కడ అల్ట్రాసౌండ్ స్కానింగ్ తీయగా, కుడివైపు కిడ్నీలో రాయి ఉన్నట్లు తెలిసింది. దీంతో కిమ్స్ సవీరా ఆసుపత్రికి పంపారు. ఇక్కడ మరిన్ని తగిన పరీక్షలు చేయగా కుడివైపు కిడ్నీలో 21 మిల్లీమీటర్ల పొడవున్న రాయి ఉన్నట్లు తేలింది. ఇంత చిన్న వయసులో పిల్లలకు కిడ్నీలో రాళ్లు ఏర్పడటమే అరుదు. అందులోనూ ఇంత పెద్ద పరిమాణంలో రాయి ఉండటం ఇంకా అరుదు. పైపెచ్చు సాధారణంగా ఇంత చిన్నపిల్లలకు కిడ్నీలో రాళ్ల సమస్యకు శస్త్రచికిత్స చేయడం కూడా ఈ ప్రాంతంలో ఇంతవరకూ జరగలేదు. అయినా లేజర్, ఎండోయూరాలజీలలో నైపుణ్యం ఉండటంతో వెంటనే బాబుకు రెట్రోగ్రేడ్ ఇంట్రారీనల్ సర్జరీ (ఆర్ఐఆర్ఎస్) అనే లేజర్ శస్త్రచికిత్సను చేపట్టాం. లేజర్ ఫైబర్ సాయంతో మొత్తం రాయిని పగలగొట్టి, దాన్ని తీసేశాం. మొత్తం శస్త్రచికిత్సకు 45 నిమిషాల సమయం పట్టింది.



ఆపరేషన్ వివరాలను వెల్లడిస్తున్న కిమ్స్ సవీరా వైద్యులు

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర వర్కింగ్ ఛైర్‌పర్సన్ పార్వతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రజకులను ఎస్సీల జాబితాలో చేర్చాలని రజక అభివృద్ధి సంస్థ రాష్ట్ర వర్కింగ్ ఛైర్‌పర్సన్ పార్వతి డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని పెన్షనర్స్ హోంలో రజక అభివృద్ధి సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్కలూరు రంగనాథ్ అధ్యక్షతన సంస్థ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రజకులను ఎస్సీల్లో చేర్చాలని అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ చేసిన పాపానపోలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అసెంబ్లీలో ఎస్సీల జాబితాలో చేరుస్తూ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.కమ్మన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఒక్కొక్క రజక కుటుంబానికి రూ.10వేల చొప్పున ఉచితంగా దాదాపు 300 కోట్ల రూపాయలు రజకులకు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు. అయితే పరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా 50 సంవత్సరాలు దాటిన రజక వృత్తిదారునికి ఇన్సూరెన్స్ పథకం అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర యువజన అధ్యక్షులు డివి కుమార్ మాట్లాడుతూ రజకులందరూ తమ సమస్యల సాధన కోసం ఐకమత్యంతో ముందుకు సాగాలని అప్పుడే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎక్కలూరు రంగనాథ్ మాట్లాడుతూ రజకులు వారి వారి పిల్లలను మంచి చదువులు చదివించి వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర సెక్రటరీ జనరల్ పి.కమ్మన్న

నూతనంగా ఎన్నికైన జిల్లా రజక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ ఎన్ సి నారాయణస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా ఛైర్మన్‌గా ఎన్నుకున్నందుకు అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రజకుల సంక్షేమం కోసం శాయిశక్తుల ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి వెంకటేష్, నరసింహా, ప్రతాప్, వెంగంపేట నాగరాజు, బాల కంబన్న, సుంకన్న, సుధాకర్, నాగేంద్ర, బళ్లారి శ్రీనివాసులు, రామాంజనేయులు, సురేష్, నార్పల ఆదెప్ప, సీనా, గంగాధర, అనంతపురం పుల్లన్న, పెద్దన్న, సాయిప్రసాద్, నరేష్, నరేష్, హర్ష, పాల్తూరు సురేంద్ర, చీకులగురికి చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే అభివృద్ధి సాధ్యం : జెసి ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దపప్పూరు



మహిళలతో మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

టిడిపి ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి సాధ్యమని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని మండల పరిధిలోని చిన్నయక్కలూరు జెసి ప్రభాకర్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే కేవలం టిడిపి, చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. అనంతరం ఆత్మీయులు, అనుచరులు, అభిమానుల ఇళ్లకు వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు గార్లదిన్నె రామకృష్ణారెడ్డి, స్థానిక నాయకులు ప్రతాపరెడ్డి, కుసుమరెడ్డి, గార్లదిన్నె జనార్దన్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

పంట వివరాలతో ఇకెవైసి తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి-ఉరవకొండ

2023 ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగు చేసి ఈ క్రాప్ చేయించుకున్న రైతులందరూ ఖచ్చితంగా ఈకెవైసి చేయించుకోవాలని విడపనకల్లు ఎఒ పెన్నయ్య సూచించారు. మండల పరిధిలోని ఉండబండ, పాల్తూరు, హావలిగి గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించి రికార్డులను పరిశీలించారు. గ్రామ వ్యవస్థాయ అధికారులతో కలిసి రైతులతో సమీక్ష నిర్వహించారు. ఎఒ మాట్లాడుతూ రైతులు ఈ నెల 8వ తేదీ లోపు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈకెవైసి చేయించుకోకపోతే పంటలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. రబీ సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు సబ్సిడీపై పప్పుశనగ విత్తనాలను పంపిణీ చేస్తుందని, కావాల్సిన రైతులు మీ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఇఒ ప్రసాద్, ఆర్‌బికె సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కిసాన్ అగ్రి క్లినిక్ షాపు తనిఖీ

మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో ఉన్న కిసాన్ అగ్రి క్లినిక్ షాపును ఎఒ పెన్నయ్య తనిఖీ చేసి ఎరువులకు సంబంధించిన బిల్లు బుక్స్‌తో పాటు రికార్డులను పరిశీలించారు. షాపులో ఉన్న ఆన్‌లైన్ స్టాక్, ఫిజికల్ స్టాక్ వ్యత్యాసాన్ని పరిశీలించి రూ. 3.8 లక్షల విలువ చేసే ఎరువులను రైతులకు అమ్మకుండా తాత్కాలికంగా నిలిపివేసినట్లు తెలిపారు. ఈ ఎరువులకు సంబంధించి బిల్లు బుక్స్‌ను సర్టిపై చేసిన తర్వాత యధావిధంగా ఎరువులను విక్రయించుకోవాలని డీలర్‌ను ఆదేశించారు.

గుంతకల్లు రూరల్ : పంటలు సాగు చేసిన రైతులు ఈనెల 8వతేదీ లోపు ఇకెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారిణి కె.స్వాతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంటలు సాగు చేసుకున్న రైతులు ఈనెల 8వ తేదీలోపు ఆయా ఆర్‌బికె సెంటర్లలో ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా మధ్యాహ్నం 2 నుంచి 10 గంటల వరకూ ఇకెవైసి యాప్ పని చేస్తుందన్నారు. ఆయా సమయాల్లో రైతులు ఇకెవైసి చేయించుకుని సహకరించాలని కోరారు.

బొమ్మనహాల్ : మండల వ్యాప్తంగా రైతులు ఈకెవైసి చేయించుకోవాలని ఎఒ సాయికుమార్ సూచించారు. బొమ్మనహాల్ లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట బీమా, తదితర ప్రయోజనాలు పొందాలంటే ప్రతి రైతు తప్పనిసరిగా ఈ నెల 8వ తేదీ లోపు ఈకెవైసి చేయించుకోవాలన్నారు. లేనిచో రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందవన్నారు. ఎఒతో పాటు ఎస్ఒ గోపాల్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు .

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు శివ, గిరి, సిద్ధు తెలిపారు. శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో కళాశాల బాలురు, బాలికల ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసి ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేశాయని విమర్శించారు. వసతిదీవెన, విద్యాదీవెన నిధులు పెండింగ్‌లో పెట్టి విద్యార్థులతో ఫీజులు కట్టించే దుస్థితికి రాష్ట్ర ప్రభుత్వం దిగజారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ పేరుతో డిగ్రీ విద్యను సర్వనాశనం చేశారన్నారు. నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ వల్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితిలో నెలకొన్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కళాశాల ఎస్ఎఫ్ఐ సమన్వయకర్తగా బసవరాజ్, కార్యదర్శిగా భీమేష్, అధ్యక్షుడిగా ప్రవీణ్, సహాయ కార్యదర్శులుగా రంగస్వామి, అజయ్, ఉపాధ్యక్షులు రాఘవ, గౌస్‌తోపాటు కమిటీ సభ్యులుగా 20 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, అజయ్, సురేష్, భార్గవ్, గౌస్, సాయికుమార్, చంద్రశేఖర్, కిషోర్, పవన్, రవి, కళ్యాణ్, మహి, మానస, ఆదిలక్ష్మి, కజిమా, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

కుందుర్పి: బాల్య వివాహాలను అరికట్టి ఆడబిడ్డలను కాపాడడమే లక్ష్యంగా పని చేద్దామని ఎంఇఒ తిప్పేస్వామి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బాల్య వివాహాల నియంత్రణపై సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులు మాట్లాడుతూ మండలంలో బాల్య వివాహాలను నిరోధించడానికి ప్రభుత్వం గ్రామస్థాయిలో బాల్య వివాహ నిరోధక, పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. తల్లిదండ్రుల ఆలోచనా విధానాలు మార్చేందుకు గ్రామస్థాయిలో తరచూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. బాల్య వివాహం చేసుకున్నా, నిర్వహించినా, సహకరించిన, హాజరైన ప్రతి ఒక్కరూ శిక్షార్హులు అవుతారన్నారు. రెండేళ్ల జైలు శిక్ష లేదా రూ. లక్ష జరిమానా లేదా రెండు విధిస్తారని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డిటి అధికారి ఆదినారాయణ, సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున, అధ్యాపకులు మహేష్, నాగేష్, రాధమ్మ, వీరయ్య, నాగరాజు, మంజునాథ, వసికేరప్ప, మారుతి పాల్గొన్నారు.

వైసిపి నాయకులపై మాజీ కౌన్సిలర్ ఫిర్యాదు

రాయదుర్గం : టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులును దూషించిన వైసిపి నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం మాజీ కౌన్సిలర్ సిద్దన్న ఎస్ఐ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పట్టణంలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షలో వాల్మీకి సంఘం నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనడం చూసి ఓర్వలేక వైసిపి పట్టణ కార్యదర్శి పవన్, మలి, నాగరాజు(ఒబా) సోషల్ మీడియాలో కాలవ శ్రీనివాసులు నాలుక కోసేస్తాం, అతడిని రాయదుర్గం నుంచి తరిమికొడతామని వీడియోలు పోస్టు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సిద్దన్నతో పాటు టిడిపి బిసి సెల్ కార్యదర్శి పూజారి తిప్పయ్య, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, తిప్పేస్వామి, రవి, అశోక్, పరమేశ్వర, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌బిఎన్‌లో మెగా జాబ్‌మేళా

అనంతపురం : రాష్ట్ర శిక్షణ నైపుణ్య అభివృద్ధి సంస్థ, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలోని శ్రీ సాయిబాబా జాతీయ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సి.ప్రభాకర్‌రాజు అధ్యక్షతన మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాలో 14 పెద్దపెద్ద పారిశ్రామిక కంపెనీలు వచ్చి ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారిణి కళ్యాణి మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి విచ్చేసిన 14 రకాల కంపెనీల్లో మీ అర్హతకు తగిన కంపెనీలో ఉద్యోగం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా 468 మంది నిరుద్యోగులు హాజరుకాగా 176 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి ఎల్.ఆనందరాజు, కళాశాల సెక్రటరీ కె.నిర్మలమ్మ, కళాశాల సీడీసీ కన్వీనర్ కె.దేవకీమణి, విష్ణు, మురళీ, సురేంద్ర, మంజువాణి, రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

13న బహుజన రాజ్యాధికార చైతన్య సభ

రాయదుర్గం : ఈ నెల 13వ తేదీ గుంతకల్లు పట్టణంలో నిర్వహిస్తున్న బహుజన రాజ్యాధికార చైతన్య సభను విజయ వంతం చేయాలని బహుజన సమాజ్ పార్టీ రాయదుర్గం తాలూకా ఇన్‌ఛార్జి టి.ఉలిగప్ప పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద చైతన్య సభ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో తాలూకా ప్రధాన కార్యదర్శి గంగారాం, మండల కన్వీనర్ కరీం, కణేకల్లు మండల అధ్యక్షులు మల్లికార్జున, కన్వీనర్ ప్రసాద్, కొల్లప్ప, మారెన్న, నాగారాజు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో ఆరోగ్యాంధ్రప్రదేశ్
మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-శెట్టూరు

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకే సిఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అయ్యగార్లపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆరోగ్య సిబ్బంది ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయా స్టాళ్లలోని వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. తర్వాత అక్కడికి విచ్చేసిన రోగులను పలకరించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలకు స్పెషలిస్టు డాక్టర్లు వచ్చి వైద్యం అందించడం గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులతోపాటు చిన్నపిల్లల వైద్య నిపుణులు, స్పెషలిస్ట్ డాక్టర్లు, ఆశావర్కర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించడమే సిఎం జగనన్న ప్రభుత్వ లక్ష్యమని ఎంపిపి చిట్రెడ్డి జయలక్ష్మి, సత్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రయివేట్ ఆసుపత్రులకు వెళ్లి రూ.లక్షలు ఖర్చు చేయకూడదనే సిఎం జగన్ ఈ కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగా 15 రోజుల నుంచి ఆరోగ్య శాఖ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పసుపుల హేమవతి, వైస్ ఎంపిపిలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మి రవి, మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎంపిడిఒ సోలమాన్‌రాజ్, సాకే చంద్ర, వార్డ్ సభ్యుడు జయన్న, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.